తూర్పుగోదావరి జిల్లా నూతన ఎస్పీగా నరసింహకిషోర్ నియామకం

ఎమ్మెల్యే దాట్లకు ఆత్మీయ సన్మానం

విశాలాంధ్ర - ముమ్మిడివరం : నలమాటి కళ్యాణ మండపం ఆకొండి రామకృష్ణ అధ్యక్షతన బ్రాహ్మణ, అర్చక, పురోహిత సభ్యులు ఆధ్వర్యంలో ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల బుచ్చిబాబుకి నాలుగు మండలాల బ్రాహ్మణ సంఘం తరఫున ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుచ్చిబాబు మాట్లాడుతూ ఎన్నికలలో నాకు సహకరించి గెలుపునకు లకృషి చేసిన బ్రాహ్మణ సంఘ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మాకు బ్రాహ్మణులు అంటే ప్రత్యేక గౌరవం అని మాకు అన్ని రంగాలలోనూ ఈ స్థాయికి రావడం జరిగింది. తెలుగుదేశం ప్రభుత్వం 2014లో బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.230 కోట్లు ఇచ్చి పేద బ్రాహ్మణులను ఆదుకోన్నామని, 2024లో కూడా బ్రాహ్మణులను తెలుగుదేశం ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు చెల్లి వివేకానంద, తాడి నరసింహారావు, దాట్ల పృథ్విరాజ్, నాగపట్ల రవి, ఆకొండి ఉమా మహేష్, కొంపెల్ల సుబ్రమణ్యం, యనమండ్ర సీతారామశాస్త్రి, నాగ బట్ల సుబ్రహ్మణ్యం (బుజ్జి) నాగభట్ల రవి శర్మ, వాసంశెట్టి అమ్మాజీ పాల్గొన్నారు.

శాశ్వత ప్రాతిపదికన ఉపాధి కల్పించాలి

రైతు భరోసా కాంట్రాక్టు సిబ్బంది

విశాలాంధ్ర - సీతానగరం : శాశ్వత ప్రాతిపదికన మాకు ఉపాధి కల్పించాలని రైతు భరోసా కాంట్రాక్టు ఉద్యోగులు కోరుతున్నారు. ఈ సందర్భంగా రైతు భరోసా కాంట్రాక్టు సిబ్బంది మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్స్ వంటి వివిధ పోస్టులలో నియమించబడ్డామని, మా విధులను ఉత్తమంగా ఎటువంటి ప్రతికూల వ్యాఖ్యలు లేకుండా ఉన్నతాధికారుల సంతృప్తి మేరకు పని చేశామని అన్నారు. 2023-24 సంవత్సరపు రబీ, ఖరీఫ్ సీజన్లలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి కృషి చేసి మా అంకితభావంతో వరి సేకరణలో లక్ష్యాన్ని సాధించడంలో విజయం సాధించామని పేర్కొన్నారు. ఈ ధాన్యం సేకరణలో లబ్ధిదారులైన రైతులతో మంచి కనెక్టివిటీని సృష్టించడంలో కూడా విజయం సాధించామని తెలిపారు. కావున వ్యవసాయం లేదా మరే ఇతర రంగాల్లో నైనా మా సేవలను విరామం లేకుండా కొనసాగేలా మా సమస్యను మానవతా దృక్ప థంతో చూడవలసిందిగా ముఖ్యమంత్రిని, ఎమ్మెల్యే, అధికారులు, వినమ్రంగా కోరుతున్నామని వారు వేడుకుంటున్నారు, ఈ కార్యక్రమంలో కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల రైతు భరోసా కాంట్రాక్టు సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరు ఇళ్ల స్థలాల అక్రమార్కుల పై చర్యలు తప్పవా?

విశాలాంధ్ర - పెదపూడి : వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా అనపర్తి శివారు కొత్తూ రులో ఇచ్చిన ఇళ్ళ స్థలాల్లో అక్రమాలు జరిగాయని సొంత ఇళ్ళు, స్థలాలు ఉన్న వారికే ఇళ్ళ స్థలాలు ఇచ్చారని, అప్పటి లోనే ఆరోపణలు వెల్లువె త్తాయి. నిజమైన అర్హు లకు ఇళ్ళ స్థలాలు దక్క లేదని కొంతమంది వ్యక్తులు తమకు అనుకూలంగా ఉన్న, తమకి కావలసిన వారికే ఇచ్చు కోవ డం, బినామీ పేర్లతో కొత్తూరుకు చెందిన నేతలే కొన్ని స్థలాలు కాజే శారనే ఆరోపణలు అప్పట్లో జోరుగా వినిపించాయి. అనపర్తికి చెందిన మరో నేత ఒకచోట వచ్చిన ఇళ్ల స్థలాల లబ్ధి దారులకు కొత్తూరులో ఇప్పించి ఒక్కొక్కరి దగ్గర ఒక్కొక్క లక్ష కాజేశారనే ఆరోపణ అప్పట్లో చంచలనం సృష్టించింది. అయితే అప్పటి ప్రతిపక్ష నేతలు కొత్తూరు ఇళ్ళ స్థలాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించడం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అయితే ప్రతిపక్ష పార్టీ అధికారంలోకి రావడంతో కొత్తూరు ఇళ్ళ స్థలాల అక్రమాల పై ఆరా తీస్తున్నట్టు అక్రమార్కుల పై త్వరలో చర్య తీసుకోనున్నారని జోరుగా ప్రచారం సాగుతోంది.

సీపీఎస్ ఉద్యోగులకు జీపీఎస్ అమలుపై యుటిఎఫ్ ఖండన : 7జీవో ప్రతుల దగ్ధం

విశాలాంధ్ర - అమలాపురం : సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని ఉద్యోగ ఉపాధ్యాయుల ఆకాంక్షగా ఉంటే, దానికి విరుద్ధంగా గత ప్రభుత్వం జిపిఎస్ అమలు చేస్తానని చెప్పిన పోరాటాలు ఫలితంగా తాత్కాలికంగా జీవోను విడుదల చేయలేదని, ఇప్పుడు బ్యాక్ డేట్‌తో జిపిఎస్ అమలు చేస్తూ రాజపత్రాన్ని విడుదల చేయుటం దుర్మార్గమని యుటిఎఫ్ తీవ్రంగా ఖండించింది. 2023 అక్టోబర్ నుంచి సిపిఎస్ ఉద్యోగులందరినీ జిపిఎస్‌లోకి తెస్తూ రాజపత్రాన్ని ఇప్పుడు విడుదల చేయుటం ఉద్యోగ, ఉపాధ్యాయులు మోసపుచ్చుటమేనని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ రాజపత్రాన్ని రద్దు చేయాలని, తక్షణం పాత పెన్షన్‌ని పునరుద్ధరించడానికి కోసం చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటివిపిఎస్ సుబ్బారావు డిమాండ్ చేశారు. 2017లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ని తక్షణం అమలు చేసి 2003 డిఎస్సీ ద్వారా అపాయింట్ అయిన ఉపాధ్యాయులందరినీ తిరిగి పాత పెన్షన్‌లోకి పునరుద్ధరించడానికి కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపుమేరకు గడియార స్తంభం సెంటర్ నందు గెజిట్ కాపీలను దగ్ధం చేయడం జరిగినది. జిఓలను మంటల్లో వేసి దహనం చేయడం జరిగినది. వెంటనే జిపిఎస్‌ని రద్దుచేసి ఓపిఎస్ పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు బేతినిడి శ్రీనివాసరావు, కోశాధికారి కేశవరావు, జిల్లా కార్యదర్శిలు జివి రమణ, పీ మురుగేశ్వరరావు, కే శ్రీనివాస్, అడబాల కాశి, చంద్రకళ, విరత్నం, బిఎస్ వెంకటేశ్వంరావు, బి శ్రీనివాసరావు, జిఎస్ ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేస్తాం

శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : నగరంలో కురిసిన వర్షపు నీరు నిలువ ఉండకుండా డ్రైనేజీలు ద్వారా దిగువ ప్రాంతానికి పారుదలయ్యే విధంగా డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేయడం వలన ఇంత వర్షం పడుతున్న రోడ్లపై చుక్క నీరు కూడా లేదని సిటీ శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి నగరంలోని 22, 36 డివిజన్లలో పర్యటించి అక్కడ ప్రజా సమస్యలను తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ నెల రోజులుగా నగరంలోని డ్రైనేజీ వ్యవస్థను పటిష్ట పరచటం కారణంగా ఈరోజు ఏక దాటిగా దాదాపు ఎనిమిది గంటల పాటు వర్షం పడిన వర్షపు నీరు నిలవ ఉండకుండా డ్రైనేజీలు ద్వారా దిగు ప్రాంతానికి వెళ్లడం జరిగిందన్నారు. అయిన ప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఇంకా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచవలసి ఉందని ఆ దిశగా నగర పాలక సంస్థ అధికారులు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వ నాయకులు డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి సారించలేదని అందువల్ల డ్రైనేజీ వ్యవస్థ కుంటుపడి చిన్నపాటి వర్షానికే వీధులు జలమయం అయ్యేవి అన్నారు. గత నెల రోజులుగా ఆరోగ్యశాఖ, నగర పాలక సంస్థ అధికారులు సమన్వయంతో ప్రజల ఆరోగ్య దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్, డ్రైనేజీ ప్రక్షాళన వంటి కార్యక్రమాలు చేపట్టటం వలన ఈరోజు వర్షం నీరు వచ్చిన నిలువు లేకుండా డ్రైనేజీ ద్వారా పారుదల య్యాయి అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా వర్షం పడుతు న్నప్పటికీ నేడు 22వ వార్డులో వర్షాన్ని కూడా లెక్క చెయ్యకుండా అధికారులతో పర్యటించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడం జరిగింద న్నారు. అదేవిధంగా మంగళవారం ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించి సీజనల్ వ్యాధులు, డయేరియా ప్రబలకుండా నిర్మూలించే దిశగా పటిష్టమైన ప్రణాళిక ద్వారా కార్యాచరణ అమలు చేయడం జరుగుతుందని శాసనసభ్యులు ఆదిరెడ్డి వాసు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యాళ్ల ప్రదీప్, శెట్టి జగదీష్, మటూరి సిద్దు, నారాయణరావు, రాజేష్, రాజా, నల్లం ఆనంద్, పింకేష్, అజిత్, బృంగిమల, నారాయణ, దాసరి రమేష్, ఫైండ రవి నగర పాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్ ఆర్టీసీ సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - కాకినాడ : ఏపీఎస్ ఆర్‌టిసి సమస్యలను కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను కలిసి పెద్దిరెడ్డి లసత్యనారాయణ, సీపీఐ నాయకులు కొమ్మర్తి శ్రీనివాసు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వైబాబి, వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీఎస్ ఆర్‌టిసి ముఖ్య సలహాదారులు పెద్దిరెడ్డి సత్యనారాయణ, సీపీఐ నాయకులు కొమ్మర్తి శ్రీనివాస్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై బాబి మాట్లాడుతూ కే వెంకటేశ్వర్లు అనే డ్రైవర్‌ను నెల క్రితం వర్షం కారణంగా బస్సు క్యాబిన్ నుంచి చివరి వరకు వర్షం కారడంతో ప్రయాణిస్తున్న ప్రయాణికులు వీడియో తీసి మీడియాకి పంపించగా అది నువ్వే చేశావని అక్రమంగా కేవెంకటేశ్వర్లు సస్పెండ్ చేశారు. అలాగే బస్సు డ్యామేజ్ జరిగితే డ్రైవర్ల తోనే డబ్బులు వసూలు చేస్తున్నారని గతంలో కూడా 15 మంది డ్రైవర్‌ను సస్పెండ్ చేశారని వాళ్ళని ఇప్పటి వరకు విధుల్లోకి తీసుకోలేదని అన్నారు. ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ స్పందిస్తూ డిపి టిఓకి ఫోన్ చేసి సమస్యలు అడిగి తెలుసుకుని త్వరగా ఈ సమస్యలు పరిష్కారం చేయాలని చెప్పారు. త్వరలోనే ఆర్‌టిసి సమస్యలు పరిష్కారిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పొన్నాడ దుర్గాప్రసాద్, సతీష్, శ్రీను పాల్గొన్నారు.

రూ2.50 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం

విశాలాంధ్ర - కాట్రేనికోన : మండలంలోని చిర్రయానం బ్రిడ్జి నుండి నీళ్ల రేవు భైరవ స్వామి గుడి వరకు ఎన్‌ఆర్‌జిఎస్ నిధులు రెండున్నర కోట్ల రూపాయలతో నిర్మించే నాలుగున్నర కిలో మీటర్ల బీటీ రోడ్డుకు కాట్రేనికోన మండల పరిషత్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించింది. శనివారం మండల పరిషత్‌లో మండల వైస్ ఎంపీపీ సాన బోయిన నాగేశ్వరరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు ఇటీవల ఈ రోడ్డును మంజూరు చేయించిన నేపథ్యంలో ఆమోదం కోసం మండల పరిషత్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. అలాగే కాట్రేనికోన సర్పంచ్ గంటి వెంకటసుధాకర్ సూచన మేరకు ప్రయాణికుల సౌకర్యార్థం కాట్రేనికోన గేట్ సెంటర్లోని ఆర్టీసీ బస్సు సెంటర్ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు అద్దె టెండర్లు ఖరారు చేయకుండా పక్కా షెల్టర్ నిర్మించేందుకు గ్రామపంచాయతీకి అప్పచెప్పాలని, ఒకటి నుండి 10వతరగతి వరకు చదివే ఎస్సీ విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మండల కేంద్రమైన కాట్రేనికోనలో ఎస్సీ సంక్షేమ హాస్టల్‌ను ఈ విద్యా సంవత్సరం నుండే నెలకొల్పాలని కోరుతూ తీర్మానాలను ఆమోదిస్తూ ప్రభుత్వానికి పంపారు.

ఈ సమావేశాలకు వివిధ శాఖల అధికారులు హాజరు కాకపోవడంతో సభ్యులు తీవ్ర నిరసన తెలిపారు. గైర్హాజరైన అధికారులపై చర్య తీసుకోవడానికి కలెక్టర్‌కు నివేదించాలని వైస్ఎంపీపీ నాగేశ్వరావు, జడ్పిటిసి నేల కిషోర్ సూచించారు. ప్రధాన శాఖ లైన వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, విద్యుత్, పోలీస్, ఆర్డబ్ల్యూఎస్, ఎక్సైజ్, నీటిపారుదలశాఖ అధికారులు నిర్లక్ష్యంగా సమావేశానికి రాకపోవడం పై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్లంకురులో ఉపాధి హామీ కూలీల వద్ద 300 రూపాయలు చొప్పున మేట్ల ద్వారా ఫీల్డ్ అసిస్టెంట్లు వసూలు చేస్తున్నారని, పనులకు వెళ్ళని వారికి కూడా మస్తర్లు వేస్తూ అవకతవకలకు పాల్పడుతున్నా రని, ఈ విషయమే తాను జిల్లా కలెక్టరకు ఫిర్యా దు చేయనున్నట్లు సర్పంచ్ నాతి అలివేణి సమా వేశంలో తెలిపారు. మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 1 లోపు వ్యవసాయ భూములు రిజిస్ట్రేషన్ చేయించుకుని పాసు బుక్‌లు ఉన్న రైతులకే పీఎం కిసాన్ కేంద్ర ఆర్థిక సహాయం రూ.2000 మంజూరు అవు తుందని, కొత్తగా దరఖాస్తు చేసుకున్న రైతులకు ఆర్థిక సాయంరాదని తెలిపారు. ఈ సమా వేశంలో జడ్పిటిసి కిషోర్, వైస్ ఎంపిపి అరుణ, ఏవో శ్రీనివా సరావు, మండల జేఈ ఫకీర్, చెయ్యేరు సర్పంచ్ సురేష్, పల్లం సర్పంచ్ మల్లాడి బాబ్జి, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలసిన తాడి

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం అర్బన్ డవలపమెంట్ అథారిటీ చైర్మన్ పదవి పందేరం కోనసీమ రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ పదవి కోసం ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అండదండలతో రంగంలో దిగిన దివంగత నాయకుడు తాడి తాతారావు తనయుడు సీనియర్ టిడిపి నాయకుడు తాడి నరసింహారావు కు బలమైన మద్దతు ఉన్నట్లు తెలుస్తోంది. కోనసీమలోని ఐదుగురు ఎమ్మెల్యేలలో నలు గురు ఒక కీలక ప్రజాప్రతినిది ఆయనకు మద్దతుగా లేఖలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఒక ఎమ్మెల్యే లేఖ రావా ల్సి ఉండగా ఈ వారంలో రెండు సార్లు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుతో కలిసి వెళ్లి అమరావతిలో ముఖ్య మంత్రి చంద్రబాబు ముందు లేఖ లను దాఖలు చేసారు. దీనితో అర్బన్ దేవ లపమెంట్ అథారిటీ చైర్మన్ పూర్తిగా తాడి నరసింహారావు ఖాతాలోకి వెళ్లి పోయినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా రంగంలో ఉన్న మరో నాయకుడు మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్ తనకున్న మార్గాల్లో ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇటీవల రాజకీయాల్లో చక్రం తిప్పిన ఒక యువనాయకుడు ఒక కీలక ప్రజాప్రతినిధి ఒక పారిశ్రామిక వేత్త అండదండలతో మెట్ట ప్రాంతానికి చెందిన సీనియర్ ఎమ్మెల్యే సహ కారంతో రాష్ట్రంలో ద్వితీయ శ్రేణ కీలక ప్రజా ప్రతినిది ద్వారా గణేష్ వేగంగా పావులు కదుపు తున్నట్లు అత్యంత విశ్వసనీయ వర్గాల సమా చారం. అయితే ఇటీవల గణేష్‌ని విభేధించిన వ్యతిరేక వర్గం తాజాగా కోనసీమ జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి అల్లాడి స్వామి నాయుడును తెరమీదకు తెచ్చినట్లు సమాచారం. అయితే పరి స్థితిని ముందే ఊహించి వేగంగా పావులు కది పిన దాట్ల బుచ్చిబాబు ఇతర ఎమ్మెల్యేలు కీలక ప్రజా ప్రతినిధి లెటర్లు తీసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు సమర్పించారు. దీనితో అర్బన్ డెవలపమెంట్ అథారిటీ చైర్మన్ పదవి పందేరం రసకందాయంలో పడింది. అమలాపు రంలో మున్సిపల్ చైర్మన్‌గా అసమాన్యమైన అభి వృద్ధి చేసిన చిక్కాల గణేష్‌కి చైర్మన్ పదవి ఇవ్వా లని పలువురు ఆయనకు మద్దతుగా ఉండగా ఇతర ఎమ్మెల్యేల తో పాటు ముమ్మిడివరం నియో జక వర్గ నాయకులు అంతా తాడి నరసింహా రావుకు వరుస కడుతున్నారు. జిల్లా కార్యదర్శి అల్లాడిని తెరమీదకు తెచ్చినా ఆయన పావులు కదుపుతున్నా ఆనవాళ్లు కనిపించటం లేదు. రోజుకో మలుపు తిరుగుతున్న ఈ వ్యవహారం ఎటు తిరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది!

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

ఎమ్మెల్యే జ్యోతులకు భవన నిర్మాణ కార్మికుల వినతి

విశాలాంధ్ర - జగ్గంపేట : భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధరించి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు భవననిర్మాణ కార్మికులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఆనంతరం వారు మాట్లాడుతూ భవన కార్మికులకు గత ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని దానికి ప్రతిఫలంగానే జగన్ ప్రభు త్వాన్ని ఇంటికి పంపించామని అన్నారు. నూతనంగా ఏర్పడిన ఈ కూటమి ప్రభుత్వం భవన కార్మికులకు సంక్షేమ పథకాల అమలు చేస్తామని హామీ ఇవ్వడం సంతోషదాయకమని అన్నారు. ఈ ఇసుక పాలసీ అమలుకు ప్రభుత్వ ఉన్నత అధికారులు సమక్షంలో ఈ కొత్త విధా నాన్ని అమలు అయ్యేటట్లు తగు చర్యలు తీసు కోవాలన్నారు.

ఇప్పటికే దళారులు పాత రేట్లకు ఇసుక అమ్మకాలు కొన్నిచోట్ల జరు గుతున్నాయని వాటిపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సమస్యను సీఎం దృష్టిలో ఉందని పేపర్ స్టేట్మెంట్ కూడా ఇచ్చారని, సంక్షేమ పథకాలు అమలు చేయడం కోసం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి నా వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, బిల్డింగ్ వర్కర్స్ నాయకులు జీవా, గెద్దం సురేంద్ర, అన్నవరం, అర్జున్‌రావు, శుభ్రందాసు, సిహెచ్ బుజ్జి, శ్రీను, కృష్ణార్జున్, శ్రీను, చౌదరి పాల్గొన్నారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

కడియంలో ఇన్చార్జ్ జేసీ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులు ప్రభలకుండా శుద్ధిచేసిన రక్షిత తాగు నీటిని ప్రజలకు అందించడానికి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ కే దినేష్ కుమార్ ఆదేశిం చారు. కడియం మండలం కడియం గ్రామంలోని శెట్టిబలిజ పేటలో ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ దినేష్ కుమార్ పంచాయితీ, ఆర్డబ్ల్యూ ఎస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో శనివారం పర్యటించి పాత మంచినీటి ట్యాంకును తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వాటర్ ట్యాంకులను పూర్తి స్థాయిలో శుభ్రం చేసి శుద్ధి చేసిన తాగునీటిని ప్రజలకు అందించే విధంగా ఆర్డబ్ల్యూఎస్, పంచాయితీ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమ న్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులకు ముందస్తు కార్యాచరణ ప్రణాళికను అందించా మని, ఆయా గ్రామాల ప్రజలు కూడా వీటిని పర్యవేక్షిస్తూ భాగస్వాములు కావాలని ఇంచార్జ్ జేసీ కోరారు. అలాగే పలువురు గ్రామస్తులును జేసీ వాటర్ ట్యాంకులు పరిశుభ్రత, స్వచ్ఛమైన నీటిని అందించడానికి పంచాయతీ అధికారులు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. మండల అధికారులతో పాటు ఆయా గ్రామాల్లో పంచా యతీ కార్యదర్శులు, సిబ్బంది అప్రమత్తంగా వుంటూ ప్రజలకు అందుబాటులో ఉండాల న్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీఓ ఎం.నాగ లత, ఎస్.ఈ బాలసంకర్, డీ.ఈ శ్రీని వాసరావు, కడియం ఉప సర్పంచ్ వెలుగుబంటి నాని, టీడీపీ నాయకుడుసూరిబాబు, పంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలోని గొల్లప్రోలు మండలంలోని, గొల్లప్రోలు శివారు, కాకినాడ నుండి కత్తిపూడి వైపు వెళ్ళు ఎన్‌హెచ్-216 రోడ్డులో అశోక్ లేలాండ్ లారీ వాహనం నంబర్ ఎపి 05 టిసి 1238లో పిడిఎస్(రేషన్ బియ్యం)తో వెళుతుందన్న సమాచారముతో విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులతో శనివారం సదరు వాహనంను అదుపులోకి తీసుకొని తనిఖీ చేశారు. వాహనంలో 458 బస్తాలలో సుమారు 22900 కేజీల పిడిఎస్ బియ్యం ఉన్నట్టు గుర్తించారు. ఈ బియ్యంను కాకినాడ జిల్లా, గొల్లప్రోలు మండలంలోని దుర్గాడ గ్రామానికి చెందిన ఉమ్మిడి కృష్ణ కిరణ్, తండ్రి అచ్చరావు వారు గొల్లపల్లి శ్రీనివాసరావు ఆర్/ఒ దుర్గాడ వారి లారీలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రము, రాయపూర్ ఏరియాకీ రవాణా చేస్తున్నారు. ఈ బియ్యంను అక్రమముగా తరలించుట వలన సుమారు రూ.20,41,950/-లు విలువ గల 22,900 కేజీల పిడిఎస్(రేషన్ బియ్యం)ను మరియు పైన తెలిపిన వాహనంను సివిల్ సప్లయ్స్ అధికారులు (ఐ/సి) గొల్లప్రోలు వారు సీజ్ చేసి 6-ఏ క్రింద కేసు నమోదు చేసి సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు కోసం పోలీసు స్టేషన్‌కు సిఫారసు చేశారు. ఈ సందర్భముగా రీజనల్ విజిలెన్స్ ఎస్‌పి కెవిఎస్‌వి సుబ్బారెడ్డి, ఐపిఎస్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ పరిధిలోని మూడు జిల్లాలలో పిడిఎస్(చౌక బియ్యం) అక్రమ నిల్వలు, అక్రమ రవాణా పై నిరంతరం నిఘా కొనసాగుతుందని, ఎవ్వరైనా పిడిఎస్(చౌక బియ్యం) కొనడం, అమ్మడం చేస్తే సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని తెలిపారు. ఈ తనిఖిలలో విజిలెన్స్ అధికారులు ఎస్ఐ జగన్నాధరెడ్డి, ఏఓ భార్గవ్ మహేష్, పిసిఎస్ వలి, వీరబాబు, సిఎస్‌డిటి కృష్ణ , రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

జీపీఎస్ చట్టం రద్దు చేయాలి

విశాలాంధ్ర - తాళ్లపూడి : సిపిఎస్, జిపిఎస్ విధానాలు ఉద్యోగులు కోరుకునేవి కాదని, రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఆలోచనలు కూడా గత ప్రభుత్వ ఆలోచనలు మాదిరిగానే ఉన్నాయని ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు డిడి.రావు పేర్కొన్నారు. ఈ నూతన ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలను నెరవేరు స్తారని అందరూ ఆశగా ఎదురు చూస్తున్న తరుణంలో జిపిఎస్ చట్టాన్ని అమలు చేయడానికి సిద్ధమవడం సరికాదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఉద్యోగుల అభిప్రాయాన్ని పట్టించుకోకుండా ఏకపక్షంగా అసెంబ్లీలో బిల్లు పెట్టి చట్టం చేసిందని, జి.పి.ఎస్ విధానం సిపిఎస్ విధానం కంటే దారుణమైనదని, పదవీ విరమణ తరువాత పిఆర్‌సి గాని, హెల్త్ కార్డులు గానీ వర్తించవని, ఉద్యోగి కట్టిన 10% గ్రాంటును , ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ కూడా ప్రభుత్వమే తీసుకుంటుందని, దీనివల్ల ఉద్యోగులకు మేలు కలగదని అన్నారు. 33 సంవత్సరాల సర్వీసు ఉంటేనే 50 శాతం పెన్షన్ వస్తుంది. సర్వీస్ తగ్గితే పెన్షన్ తగ్గుతుంది. ఈ విధంగా అనేక నష్టాలు ఉన్నాయని, ఏ మాత్రం గ్యారంటీ లేని ఈ జి.పి.ఎస్ విధానమని ప్రస్తుత ప్రభుత్వం 2023 అక్టోబర్ 20 నుంచే ఈ చట్టం అమల్లోకి వచ్చినట్లు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయటాన్ని ఎపిటిఎఫ్ తూర్పుగోదావరి జిల్లా శాఖ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ విషయం గురించి ప్రభుత్వం స్పష్టత నివ్వాలని, ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి జీవో నెంబర్ 54 ను రద్దు చేస్తూ ప్రకటన చేయాలని లేని పక్షంలో గత ప్రభుత్వానికి ఇచ్చినట్లు ఈ ప్రభుత్వానికి కూడా రిటర్న్ గిఫ్ట్ ఇవ్వటానికి ఉద్యోగులు ఇప్పటి నుండే సిద్ధంగా ఉంటారని ఈ ప్రభుత్వం గ్రహించాలని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దున్నా దుర్గారావు, పి సువర్ణ రాజు ఒక ప్రకటనలో తెలియచేశారు.

కళాకారుడు నూకరాజుకు నగదు పురస్కారం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరానికి చెందిన రంగస్థల కళాకారుడు సానా నూకరాజు నాయుడుకి మరో మెమెంటు, నగదు పురస్కారం లభించింది. కాకినాడలోని అల్లూరి సీతా రామరాజు నాటక కళాపరిషత్ ఆధ్వ ర్యంలో మూడు రోజులపాటు కాకినాడ సూర్య కళామందిర్‌లో ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక ఏక పాత్ర అభిన యపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నూకరాజు నాయుడు ప్రదర్శించిన బ్రహ్మర్షి విశ్వామిత్ర ఏకపత్రాభినయానికి తెలుగు రాష్ట్రాల స్థాయిలో మూడవ బహుమతి లభించింది. శనివారం సూర్య కళామందిర్‌లో జరిగిన బహుమతి ప్రధానోత్సవ సభలో సానకు మెమెంటో నగదు పురస్కారంను నిర్వాహకులు కళాపరిషత్తు అధ్యక్షుడు కర్రి అచ్యుతరామరెడ్డి గౌరవ అధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పంపన దయానంద బాబు, అల్లూరి గ్రంథ రచయిత పడాల సత్యనారాయణ లుఅందించారు. ఈ సందర్భంగా నూకరాజు నాయుడుకు అభినందనలు తెలియజేసిన గ్రామ సర్పంచ్ బెందుకుర్తి సుశీలబ్బాయి, గ్రామ పెద్దలు బొల్లు కొండబాబు, దాట్ల అప్పన బాబు, సిద్ద పెద్దకాపు, అద్దేపల్లి రాజా, అద్దేపల్లి రత్నకుమారి, సీనియర్ కళాకారులు గళ్ళా పద్మారావు, బైరారాజు, జ్యోతుల అప్పారావు, సానా సూరిబాబు, చెన్నాడా రాము, జువ్వల గోపాలస్వామి తదితరులు అభినందించారు.

CHANGE OF NAME

I, **MEKALA SURYAPRAKASHRAO (NEW NAME), S/o VENKATARAO**, Previously called **MEKALA SURYAPRAKASA RAO (OLD NAME)**, Resident of D.No.1-89/1, Pedda Veedhi, Cheyyeru Gunnepalli, Vanumulamma Gudi, Mummidivaram, Dr. B.R. Ambedkar Konaseema District -533 222. Andhra Pradesh. Now Changed my name from **MEKALA SURYAPRAKASA RAO (OLD NAME)** to **MEKALA SURYAPRAKASHRAO (NEW NAME)** Today onwards Use my New Name for all further Transactions.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే జ్యోతుల పరామర్శ

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం గ్రామానికి చెందిన ప్రగడ రెడ్డి వీరబాబు తండ్రి బాబురావు ఇటీవల మరణించడంతో వారి కుటుంబాన్ని అదే గ్రామానికి చెందిన విజ్జపు రెడ్డి పెద్ద, కడియాల మణకంఠ, నాతిపం గంగాధర్ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో వారి కుటుంబాలను పరామర్శించే ప్రగాఢ సానుభూతి తెలియజేసిన జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ. ఈ కార్యక్రమంలో కుంచే రాజా, కుంచే రామకృష్ణ, పోసిన బాబురావు, అల్లం అబ్బు, దేవన వీరబాబు, అల్లం గోవిందు, అల్లం శ్రీను, గల్లా కృష్ణ, కుంచె వెంకటస్వామి పాల్గొన్నారు.

ఆదిత్యలో ముగిసిన వర్క్ షాప్

విశాలాంధ్ర - గండేపల్లి : సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో నిర్వహించిన ఐదు రోజుల నైపుణ్యాభివృద్ధి సదస్సు శనివారం ముగిసింది. ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్-ఇండియాతో కలిసి నిర్వహించిన ఐదు రోజుల "ఫండమెంటల్స్ ఆఫ్ ఆటోకాడ్ ఫర్టెక్నీషియన్స్" కుసాంకేతిక సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈసదస్సుకు డా అఖిలేష్ కుమార్ సింగ్ నేతృత్వంలో డా అబ్బిరెడ్డి శ్రీధర్ రెడ్డి, చిట్టూరి రాంప్రసాద్ మరియు చింతలపాటి పవన్ కుమార్ శిక్షణా తరగతులు నిర్వహించారు. ముగింపు సమావేశంలో ప్రిన్సిపాల్ డా ఆదిరెడ్డి రమేష్ మాట్లాడుతూ పార్టిసిపెంట్స్‌కు తమ తమ విభాగాల్లో స్కిల్స్ నైపుణ్యంను పెంపొందించడానికి ఇటువంటి వర్క్‌షాప్‌లు ఎంతో ఉపయోగపడతాయి అని వివరించారు. ఈ సందర్భంగా డీన్ అడ్మినిస్ట్రేషన్ డా వైకేఎస్ సుబ్బారావు మాట్లాడుతూ "ఆటోక్యాడ్"సాంకేతిక నిపుణులకు వివరణాత్మక, ఖచ్చితమైన సాంకేతిక డ్రాయింగ్‌లను రూపొందించడానికి ఉపయోగపడుతుందని సూచించారు. డీన్ ఐక్యూ ఎసి డా జి సంజీవ్‌రావు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాదిపతి డా స్టాన్లీఎబినైజర్ మాట్లాడుతూ ఇటువంటి శిక్షణా తరగతులు టెక్నీషియన్స్‌కు అత్యవసరం అని తెలియజేశారు.

బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడిగా దెందులూరి

విశాలాంధ్ర - కొత్తపేట : కొత్తపేట బ్రాహ్మణ సంఘ నూతన అధ్యక్షునిగా దెందులూరి ఈశ్వర్ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం గాయత్రి పరమేశ్వర బ్రాహ్మణ సంఘ కళ్యాణ మండపములో కీర్తి వేంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా దెందులూరి జగదీశ్వరప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా అజ్జరపు సుబ్బారావు, కోశాధికారిగా కీర్తి వీరవెంకట సత్యనారాయణ మూర్తి, ఉపాధ్యక్షులుగా వేమవరపు రామకృష్ణ, సహాయకార్యదర్శిగా చావలి సుబ్బరాయ శాస్త్రి, ఆరుగురు కార్యవర్గ సభ్యులని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని సంఘ సభ్యులు పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముసునూరి వేంకటేశ్వరరావు, పూర్వ కోశాధికారి కాకరపర్తి బంగారుబాబు, వేమవరపు మురళి, అయ్యగారి కృష్ణ, కొంపెల్ల శర్మ, నడిమింటి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నెహ్రూను కలసిన గోపి శ్రీనివాస్

విశాలాంధ్ర - జగ్గంపేట : స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రొంగల గోపి శ్రీనివాస్ శనివారం కలిసి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జగ్గంపేట అఖండ విజయం సాధించిన ఎమ్మెల్యే నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిశామని, రాష్ట్రంలో ఓబీసీల సమస్యలను కూటమి ప్రభుత్వంలో పరిష్కరించాలని నెహ్రూను కోరానన్నారు. కిర్లంపూడి మండలం గోనేడ గ్రామంలో గత ప్రభుత్వంలో అక్రమంగా తీసివేసిన కమ్మరి కుంటలను తిరిగి నిర్మించి వారికి ఇవ్వాలని, కోర్టు తీర్పును అమలు చేయడానికి సహకరించాలని కోరామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి జగ్గంపేట లీగల్ సెల్ కన్వీనర్ వేగి భద్రం, గౌరోజు సత్య బ్రహ్మం, గౌరోజు బాబురావు, సత్తిబాబు, శ్రీనివాస్ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జాస్మిన్‌కు ఆలిండియా ర్యాంకు

విశాలాంధ్ర - ఆలమూరు : శ్రేష్ట స్కీమ్ పోటీ పరీక్షల్లో తమ గ్రామానికి చెందిన విద్యార్థిని ఆలిండియా ర్యాంకు సాధించారని ఆలమూరు మండలంలోని సందిపూడి గ్రామ సర్పంచ్ తోట భవాని వెంకటేశ్వర్లు శనివారం తెలియజేస్తూ అభినందించారు. గ్రామంలో నేల చిట్టిబాబు సునీత దంపతుల కుమార్తె సుజాత జాస్మిన్ స్థానిక సిద్ధార్థ విద్యాసంస్థలలో ఎనిమిదో తరగతి పూర్తి చేసి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విద్యార్థిని స్వతహాగా ఆన్లైన్‌లో అప్లైచేసి 310 ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఈమెకు పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో ఉన్న మోసెస్ జోసెఫ్ సికిలి స్కూల్ నందు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సిబిఎస్ఈ ఆంగ్ల మాధ్యమంలో ఉచిత విద్యను అభ్యసించే అవకాశం లభించిందని వివరించారు. ఆల్ ఇండియా ర్యాంకు సాధించిన విద్యార్థిని పలువురు ఉపాధ్యాయులతో పాటుగా గ్రామస్తులు అభినందించారు.

సీజనల్ వ్యాధుల నివారణా చర్యలపై సమీక్ష

విశాలాంధ్ర - దేవరపల్లి : సీజనల్ వ్యాధులను గుర్తించి వాటి నివారణ చర్యలు చేపట్టాలని దేవర పల్లి ఎంపీడీవో ప్రభాకరరావు పేర్కొన్నారు. దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండలంలో కార్యదర్శులు పి హె జీవోచ్‌సి సిబ్బంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లకుఆర్డబ్ల్యూఎస్ అధికారులతో సీజనల్ వ్యాధులు నివారణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఎంపీడీవో ప్రభాకర్ రావు మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధులకు నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. ముఖ్యంగా అన్ని గ్రామాలలో శానిటేషన్ పనులు చేపట్టాలని ఇదేవిధంగా అన్ని పంచాయతీలలో మంచినీళ్ల ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయాలని పేర్కొన్నారు. డ్రైనేజీలు శుభ్రం చేయుట గ్రామాలలో చెత్తాచెదారం లేకుండా పంచాయతీ కార్యదర్శులు తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. అన్ని గ్రామ పంచా యతీల్లో శనివారం మంచినీటి ట్యాంకర్ ను శుభ్రం చేసినట్టు తెలిపారు. ఈ సమావేశంలో గ్రామ కార్యదర్శులు బి రామచంద్రరావు అమ్మిరాజు రవి కిషోర్ పిహెచ్సి సిబ్బంది ఆశ వర్కర్లు ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ కుమారి తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ నోటిఫికేషన్ విడుదలపై ఆందోళన

విశాలాంధ్ర - తాళ్లపూడి : ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన గ్యారెంటీ పెన్షన్‌సిస్టమ్ (జీపీఎస్) అమలుపై రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయుడాన్ని ఖండిస్తున్నట్లు జిల్లా సిపిఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు జోడాల వెంకట్ అన్నారు. ఇంత అత్యవసరంగా గజిట్ నోటిఫికేషన్ ఇవ్వకుండా ఉన్నట్లుండి ఇప్పుడు ఇవ్వడంపై సీపీఎస్ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి సమీక్ష లేకుండా ఉన్నట్లుండి గెజిట్ జీవో జారీ చేయడం పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నామని జిల్లా సి.పి యస్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు జోడాల వెంకట్ అన్నారు.

వల్లూరులో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : మండలంలోని అంబేద్కర్ కోనసీమ జిల్లా వల్లూరు గ్రామంలో కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్, గూడూరు చారిటబుల్ ట్రస్టు వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ఉచితంగా బీపీ, షుగర్ టెస్ట్, జనరల్ బాడీ చెకప్ ఈసీజి, కన్సల్టేషన్ తదితర పరీక్షలు ఉచితంగా చేశారు. వల్లూరు గ్రామంలో నాలుగు నెలలు క్రితం కాకతీయ కమ్మ సామాజిక కిచెన్ సెంటర్ ప్రారంభించి, ఉదయం అల్పాహారం, మధ్యా హ్నం, సాయంత్రం బోజన వసతులు కల్పిస్తున్నారని కపిలేశ్వరపురం గ్రామ మాజీ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు నెక్కంటి రాంజీ అన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలుకి దాతల సహకారం ఎంతో అవసరం అన్నారు. హైదరాబాదు నగర కమ్మ సంఘం అధ్యక్షుడు గుడూరు సత్య నారాయణ, కమ్మ బ్రహ్మజీ, తోబాటి శివశంకర్, చావా వినయ్, ప్రముఖ పారిశ్రామిక వేత్త వంటిపల్లి పాపారావు, కిమ్స్ హాస్పిటల్ వైద్యులు ఈ ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్నారు.

ఘనంగా సూర్యకుమారి పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - పెదపూడి : అనపర్తి నియోజవర్గం తెలుగు దేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు పెదపూడి మాజీ ఎంపీపీ జుత్తుక సూర్య కుమారి కృష్ణ పుట్టినరోజు వేడుకలను అభిమానులు, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీ శ్రేణుల నడుమ ఘనంగా నిర్వహించారు. అనపర్తి నియోజకవర్గం పరిధిలోని, పెదపూడి మండలాల్లోని పలు గ్రామాల నుండి కూటమి పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చి కేక్ కట్ చేసి ఆమెకు తినిపించారు. ఈ సందర్భంగా అభిమానులు పెద్ద సంఖ్యలో ఆమె ఇంటికి చేరుకొని పూలమాలలు, పుష్పగుచ్చాలతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మహిళా శక్తి కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో తిరిగి ప్రచారం నిర్వహించి నా గెలుపు కృషి చేసారని స్థానిక ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా సూర్య కుమారి మాట్లాడుతూ నియోజకవర్గం నలుమూలల నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళశక్తి ప్రచారకమిటీ, శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుభాకాంక్షలు తెలిపారని వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. కూటమి నాయకులు ఆర్ నాగు, తమలంపూడి శివరామరెడ్డి, జుత్తుక సూరిబాబు, గోపిరెడ్డి, అనుసూరి భాస్కరరావు, పెంకే ఏకాశి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు జనసేనుల ఆర్థిక సాయం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు కొత్తపల్లి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, జన సైనికులు ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం ఆరోగ్యంతో ఉన్న బాధపడుతున్న గవర బాబులుకు రూ.10 వేలు, గుణా వీరబాబుకు రూ.5 వేలు, పురం శెట్టి నర్సిమూర్తికు 5 వేలు జనసేన నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జనసేన పార్టీ నిరుపేద ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటుందని పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. కష్టపడి పని చేసిన జనసేన కార్యకర్తలకు పార్టీ అన్ని విధాలుగా భరోసా కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలోగవర రాంబాబు, చింతలపూడి రమణ, కోణమర్తి రాంబాబు, సాన లోవరాజు, గణే సుల సతీష్, ఎజి వీరబాబు, బోడపాటి మోహన్, మోకా వీరబాబు, చోడిశెట్టి చక్ర, సాన రమేష్, తోట చిన్న, సాన రాజా, పాల్గొన్నారు.

చెట్టు మీద పడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర - పెరవలి : ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా చెట్టు మీద పడి ఒక వ్యక్తి మృతిచెందిన సంఘటన శని వారం మండలంలో గల ఖండవల్లి వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చాగల్లు గ్రామానికి చెందిన మల్లుల కావలేష్ (25) అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై పేకేరు బంధువుల ఇంటికి వెళ్ళి తిరిగి వెలివెన్ను వెళుతుండగా సుమారు 11.30 గం సమయంలో ఖండవల్లి సమీపంలో హైవే వద్ద సాయి పౌల్ట్రీ ఫార్మ్ వద్దకు చేరేసరికి రోడ్డు ప్రక్కన ఉన్న చెట్టు ఒక్క సారిగా కూలి కువలేష్ పై పడగా అతనికి తలపై బలమైన గాయం అయింది. తణుకు ప్రభుత్వ హాస్పిటల్ తీసుకుని వెళ్ళగా అప్పటికే చని పోయినట్లు నిర్ధారించడంతో అతని మేనమామ బొక్క శ్రీనివాస్ ఇచ్చిన పిర్యాదు మేరకు పెరవలి ఎస్ఐ ఏ.జి.ఎస్ మూర్తి కేసు నమోదుచేసి దర్యా ప్తు చేస్తున్నారు. మృతుడు చదువు పూర్తి చేసుకుని ఉద్యోగ ప్రయత్నాలలో ఉన్నట్లు తెలుస్తుంది.

భోజన బల్లలు, కుర్చీల బహుకరణ

విశాలాంధ్ర - ఆత్రేయపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలిలోని స్థానిక మ్యాజిక్ హౌస్ వద్ద అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గత ఐదు సంవత్సరాలుగా నిర్విరామంగా ప్రతి శనివారం ర్యాలిని సందర్శించడానికి వచ్చే యాత్రికులకు చేస్తున్న ఉచిత అల్పాహార సేవను గమనించి భక్తులు నిలుచుండి తినడం చూసి రావులపాలెంకు చెందిన కెఎస్ఆర్ డెకరేషన్ అధినేత రావులపాలెం మండల కోనసీమ టెంట్ హౌస్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెలగల కాశీ విశ్వేశ్వర్ రెడ్డి సుమారు 25 వేల రూపాయలు విలువ గల భోజనం బల్లలు, కుర్చీలను బహుకరించినట్లు నిర్వాహకులు డాక్టర్ మోహిత్ తెలిపారు. ఈ సందర్భంగా కాశిరెడ్డి సౌజన్యంతో ఈ రోజు భక్తులకు ఉచిత అల్పాహారం ఇడ్లీ, బజ్జీలు, టీ, చిన్నారులకు పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్యామ్, అన్నపూర్ణ, తేజశ్రీ, నాగ వీరమణి, డాక్టర్ సూర్యచంద్రరావులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డ్రై డే కార్యక్రమం

విశాలాంధ్ర - పెరవలి : సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు ఫ్రైడే డ్రై డే కార్యక్రమం శనివారం పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్ ఉంగటి రాజేష్ బాబు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత,డెంగ్యూ,మలేరియా దోమ కాటు వలన కలిగే రోగాల పట్ల అవగాహన కలుగ చేశారు. ఎక్కువగా వర్షాలు కురుస్తున్నందున మన పరిసరాల చుట్టూ గుంతలలో నీటి నిలువలు ఎక్కువగా ఉండటం వలన దోమల సంతతి పెరిగి ఆదోమకాటు వలన డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలకు వివరించారు. దోమలు పెరగకుండా తీసుకోవలిసిన జాగ్రత్తలుపై అవగాహన కల్పించారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడటమే కాకుండా, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించాలని ప్రజలను చైతన్య పరిచారు. ఈకార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది యం.గ్రేస్ ఎమ్మే లియమ్మ , సూర్యనారాయణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గోవింద నామాలతో మార్మోగిన కోనసీమ తిరుమల

స్వామివారిని దర్శించుకున్న జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమల, ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధిగాంచిన ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామంలోని శ్రీ భూ సమేత వెంకటేశ్వర స్వామివారి క్షేత్రం గోవింద నామాలతో మార్మోగింది. శనివారం కావడంతో ఏడువారాల మొక్కలు చెల్లించుకునేందుకు భక్తులు బారులు తీరారు. వేలాదిగా భక్తులు కాలినడకన తరలివచ్చారు, ఏడువారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అనే నానుడితో రాష్ట్ర నలుదిక్కుల నుండి భక్తులు తరలివచ్చి చందన స్వరూపుడైన స్వామిని దర్శించుకుని దివ్య ఆశీస్సులు పొందుతున్నారు. దూర ప్రాంతాల నుండి కాలినడక వచ్చే భక్తులు శుక్రవారం సాయంత్రానికి ఆలయానికి చేరుకుని ఆలయ ప్రకార మండపంలో సేద తీరుతున్నారు. శనివారం తెల్లవారుజామున గౌతమీ గోదావరిలో తల స్నానాలను ఆచరించి, మొక్కు బడులు చెల్లించుకునే భక్తులు తలనీలాలు స్వామి వారికి సమర్పించుకుని సంప్రదాయ వస్త్రధారణలతో స్వామివారి ఆలయ మాడవీధుల్లో ఏడు ప్రతిక్షణాలు నిర్వహిస్తూ గోవిందా నామస్వరాలతో ఆలయమంతా మారుమోగింది. స్వామివారి ఆలయ సన్నిధిలో ఐశ్వర్య లక్ష్మీ హెరీమం అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి సుప్రభాత సేవ, మేలుకొలుపు సేవ, స్వామివారి పుష్పాలంకరణ అనంతరం స్వామివారి మొదటి హారతితో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఏడువారాల నోము నోసుకొనే భక్తులు చందన వెంకటేశ్వరస్వామి నిలువెత్తు స్వరూపాన్ని దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీ వెంకటేశ్వర స్వామిని తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందు తలెత్తకుండా తగు ఏర్పాటు చేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ బి కిషోర్ కుమార్ తెలిపారు. శనివారం ఒక రోజే ప్రత్యేక దర్శనం ద్వారా రూ.26,08,394/- అన్నదాన ప్రసాదం ద్వారా స్వామి సేవా రూ.1,59,646/- లడ్డువిక్రయం ద్వారా రూ.5,97,675/-, ఆన్లైన్ ద్వారా రూ.73,616/- భక్తుల విరాళం ద్వారా రూ.1,490/- సేవలు వల్ల ఆదాయం రూ.20,400/- మొత్తం రూ.34,61,221- మధ్యాహ్నం మూడు గంటల వరకు వచ్చిన ఆదాయమని ఆలయ కార్య నిర్వహణ అధికారి బి కిషోర్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), కరటూరి నరసింహారావు మాజీ దేవస్థానం చైర్మన్, తదితరులు నాయకులు పాల్గొన్నారు. ఆలయం వద్ద శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా ఎస్సై శ్రీనివాస్ సిబ్బందితో పర్యవేక్షించారు.

ఆలయ దొంగలను పట్టించిన యువత

- సినీ ఫక్కీలో చేజ్
- యువత సాహసాన్ని అభినందించిన గ్రామస్తులు

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలో వివిధ ఆలయాల్లోనీ డిబ్బీలను కొల్లగొట్టి దర్జాగా దొరల్లా తిరుగుతున్న దొంగలను గ్రామ యువత సినీ ఫక్కీలో చేజ్ చేసి పట్టుకున్న సంఘటన సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఎన్టీఆర్ సెంటర్లో వరుసగా పలు ఆలయాల్లో డిబ్బీ దొంగతనాలకు పాల్పడుతున్న దొంగలను రఘుదేవపురం గ్రామానికి చెందిన పలువురు యువకులు శుక్రవారం అర్ధరాత్రి చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి రఘుదేవపురం గ్రామంలోని కోట దుర్గమ్మ ఆలయ కమిటీ యువకులు తెలిపిన వివరాలు ప్రకారం కోట దుర్గమ్మ ఆలయంలోని డిబ్బీనీ చొరికి యత్నించగా అదే సమయంలో సీతానగరం నుండి ఇంటికి వస్తున్న రఘుదేవపురం యువకుడు జరుగుతున్న ఉదంతాన్ని చూసి అదేంటి అని ప్రశ్నించి చుట్టూ పక్కల యువకులు కోసం పెద్దగా కేకలు వేయడంతో దొంగలు తప్పించుకొని అక్కడ నుండి పారిపోయారన్నారు. దీంతో ఆ దొంగల కోసం గ్రామస్తులు ,యువకులు వెంబడించిన ఫలితం లేకపోవడంతో తిరిగి వచ్చేసరన్నారు. ఇదే గ్రామంలో యనమందులు రామాలయం వద్ద డిబ్బి దొంగలించి అక్కడ నుండి కోరుకొండ వెళ్లి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వద్ద మరో డిబ్బి దొంగలించి తిరిగి రఘుదేవపురం అదే దొంగలు వచ్చారన్నారు. వారి రాకను గమనించిన యువకుడు వారి ద్విచక్ర వాహనాన్ని ఆపి వారిని ప్రశ్నించగా వాహనం పై పారిపోవటానికి ప్రయత్నించరన్నారు.మరల యువకులు వారిని వెంబడించి ఎన్టీఆర్ సెంటర్లో పట్టుకోగా ఒక వ్యక్తి దొరికిపోయాడని,మరో వ్యక్తి పరారయ్యారాన్నారు. దీనితో కోరుకొండ, సీతానగరం పోలీసులకు సమాచారం ఇచ్చి యువకులు డిబ్బి దొంగను, దోచిన నగదు, ఒక ద్విచక్ర వాహనాని కూడా స్థానిక పోలీసులకు అప్పగించారు. దీనితో యువకులు చేసిన ధైర్య సహసాలకు గ్రామ ప్రజలు అభినందించారు.

విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : స్థానిక ప్రత్తిపాడు బజార్ వీధి రామాలయం వద్ద సదా మీ సేవ (ఎస్ఎంఎస్) స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అందిస్తున్న సేవలను నిరుపేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీషిర్డిసాయి జ్యూయలరీస్ అధినేత పడాల శ్రీనివాసరెడ్డి కోరారు. శనివారం సదా మీ సేవ స్వచ్ఛంద సేవ సంస్థ ద్వారా నిరుపేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈకిట్లను సమకూర్చిన పడాల శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా నిరుపేద విద్యార్థులకు అందజేశారు. పౌష్టికాహార కిట్లతో పాటు భోజన వసతి కూడా ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ మండల ప్రెసిడెంట్ సలాది కృష్ణ, సదా మీ సేవ స్వచ్ఛంద సేవా సంస్థ మెంబర్లు గొందేసి సత్యానందం, ఎస్వీ సోమేశ్వరరావు, భేరి రాంబాబు, కె జగదీశ్వరి, శిరసాల మణికంట జ్యోతి, ఎస్ కుమారి, లక్ష్మి తదితులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-దేవరపల్లి: మండలంలో పల్లంట్ల గ్రామంలో కొలువై ఉన్న శ్రీ శ్రీ శ్రీ రాజరాజేశ్వరి సమేత దుర్గ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆలయ దాతలు మొగలపు లక్ష్మణరావు కుమారుడు వీర వెంకట సత్యనారాయణ దంపతులు హెూమాలు నిర్వహించి స్వామివారికి పులిహెూర మహా నైవేద్యం సమర్పించి ఆలయానికి విచ్చేసిన భక్తులకు, గ్రామం అంతట ప్రసాద వితరణ అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వై. రామకృష్ణ శర్మ, మొక్కపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన తొలి ఏకాదశి సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి కాయగూరలతో శాకంబరిగా అలంకరిస్తామన్నారు మరియు ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మరియు రాష్ట్ర మానవత కన్వీనర్ బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామస్తుల సహకారాలతో కాశి తరహాలో నాలుగు దిక్కులు గుమ్మాలు ఏర్పాటు చేసి నిర్మించిన శివాలయానికి రాష్ట్ర నలుమూల నుండి విచ్చేస్తున్న ప్రజా ప్రతినిధులు మరియు అధికారులు మరియు భక్తులతో అభివృద్ధి చెందుతుంది అని ఆలయం పక్కనే ఉన్న కైలాస భూమి అభివృద్ధి చేస్తూ గత రెండు సంవత్సరాల నుండి దహన సంస్కారాలకు కట్టెలు ఉచితంగా ఏర్పాటు చేసినానని, మహాదేవుని నివాసమైన కైలాస భూమిలో అనాధ ప్రేత సంస్కారం అశ్వమేధ సమంవిదు అని మన పురాణాలు తెలియజేస్తున్నాయని ఇటువంటి మహెూన్నతమైన కార్యక్రమానికి దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈడుపుగంటి రంగారావు, బలుసు విజయలక్ష్మి గ్రామ ప్రజలు భక్తులు పాల్గొన్నారు

అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - కొవ్వూరు : అంగన్వాడీ వర్కర్లు హెల్పర్ల సమస్యలు కొవ్వూరు: అంగన్వాడీ వర్కర్లు హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం ఇచ్చారు. కొవ్వూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు ని కలిసి వారి సమస్యలను వివరించారు. రెండు నెలలకు పైగా రోడ్లపలై ఆందోళన చేసిన విషయాలను ప్రస్తావించారు. ఎన్నికల అనంతరం కనీస వేతనం ఇస్తానన్న ప్రభుత్వ హామీని ఈ ప్రభుత్వం నెరవేర్చరా సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. చాలీచాలని జీతాలతో అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లుగా పని చేస్తున్నామని తమ వేతనాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని వారు వినతిపత్రంలో కోరారు. కోరుతూ కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం ఇచ్చారు. కొవ్వూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు ని కలిసి వారి సమస్యలను వివరించారు. రెండు నెలలకు పైగా రోడ్లపలై ఆందోళన చేసిన విషయాలను ప్రస్తావించారు. ఎన్నికల అనంతరం కనీస వేతనం ఇస్తానన్న ప్రభుత్వ హామీని ఈ ప్రభుత్వం నెరవేర్చరా సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. చాలీచాలని జీతాలతో అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లుగా పని చేస్తున్నామని తమ వేతనాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని వారు వినతిపత్రంలో కోరారు.

పిల్లలకు ఆహార పదార్థాల పంపిణీ

విశాలాంధ్ర - అనపర్తి : స్థానిక రైజింగ్ హ్యాండ్స్ ఫర్ హెూప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో భవిత సెం టర్లో ఉన్న దివ్యాంగ పిల్లలకు పలు ఆహార పదార్థాలు పం పిణీ చేశారు. శనివారం అన పర్తి శివారు కొత్తూరుకి చెం దిన కొవ్వూరి సురేష్ రెడ్డి జన్మ దినోత్సవం పురస్కరించుకుని దివ్యాంగులకు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడి మట్టి బొమ్మలు, విగ్రహాలు అమ్ముకునే నిరుపేద కుటుంబాలకు పలు ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు నల్లమిల్లి ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అతిసార పై అప్రమత్తం

- నీటి నమూనాల సేకరణ ... స్పెషల్ శానిటేషన్ డ్రైవ్
- బాధితుల ఆరోగ్యపై ఆరా

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ దుమ్ములపేట, పర్లోపేట ప్రాంతాల్లో ముగ్గురు అతిసార బారిన పడడంతో నగరపాలక సంస్థ యంత్రాంగం అప్రమత్తమైంది. కార్పొరేషన్ కమిషనర్ జే వెంకటరావు ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ పృథ్వీ చరణ్ శనివారం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. అతిసార బాదితుల నివాసిత ప్రాంతాల్లో నగర పాలకసంస్థ ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఆయా ప్రాం తాలను పరిశుభ్రం చేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇంజనీరింగ్, వాటర్ వర్క్స్ విభాగానికి చెందిన అధికారులు, సిబ్బంది నీటి నమూనాలను పరిశీలించారు. నీటి లోపం లేదని నిర్ధాహరణకు వచ్చారు. పరి సరాల పరిశుభ్రత, ఆహార లోపం వల్ల వంటి కారణాల పై ఆరా తీస్తున్నారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ అతిసార పై ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని, జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చున్నారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు.

ఎడతెరిపిలేని వర్షం... రోడ్లు జలమయం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలంలో శనివారం తెల్లవారుజాము నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం వలన జనజీవన స్తంభించింది. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు వర్షం వలన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ కూలీలు చేతివృత్తుల వారు వర్షం వలన పనులకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండిపోయారు . వర్షం వలన మండలంలో అనేక వాగులు పొంగి పొర్లుతున్నాయి . ఈ వర్షం వలన మండలంలో రోడ్లలో కుంటలలో నీరు నిలువ ఉండిపోయాయి. దీని వలన మోటార్ సైకిల్ పై వెళ్లేవారు ఆటోలు వెళ్లేవారు అనేక ఇబ్బంది పడుతున్నారు. దేవరపల్లి మండలంలో దేవరపల్లి నుండి లక్ష్మీపురం రోడ్డు పల్లంట్ల కురుకుర్ రోడ్డు ఎర్నగూడెంనుండి త్యాజంపూడి రోడ్డు ఎర్నగూడెం నుండి సంగాయిగూడెం రోడ్లు ప్రయాణించాలంటే పలు ఇబ్బందులు, అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్లకు మోక్షం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.